
సాక్షి
బాపట్ల
శనివారం। 22। ఫిబ్రవరి। 2025



మాతృభాషా దినోత్సవం

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో శుక్ర వారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 534.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,452 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కనక దుర్గమ్మకు ధాన్యాభిషేకం

పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీనగర్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ దేవస్థానంలో శుక్ర వారం ధాన్యాభిషేకం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

షాదీఖానాకు భూమి పూజ



బల్లికురవ: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వైదన గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న ముస్లిం సామాజిక భవనం (షాదీఖానా)కు భూమిపూజ చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఉపాధి నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. బాపట్ల జిల్లా ఏపీయూజేజే 2025 నూతన డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారి పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



మాచర్ల: పట్టణంలో శుక్రవారం గాయత్రీ మహాయజ్ఞం కనులపండువగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 500 మంది శోభాయాత్రలో పాల్గొన్నారు. తొలుత కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశాక కలశాలతో ముందుకు సాగారు. లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి వెళ్లి గాయత్రీ మహా యజ్ఞంలో పాల్గొన్నారు. భారీగా దీప యజ్ఞం నిర్వహించారు. అఖిల విశ్వ గాయత్రీ పరివార్ శాంతికుంజ్ హరిద్వార్ మాచర్ల శాఖ వారి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటైంది. సీఐ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఇంటర్ దూరవిద్య పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) ఆధ్వర్యంలో మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్.అక్బర్ అలీ, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఇంటర్మీడియెట్ దూరవిద్య పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులను శుక్రవారం డీఈఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ, ఆయా తేదీలలో ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అరగంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 9 కేంద్రాలలో 2,117 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో దూరవిద్య సమన్వయకర్త కె.ఎం.ఎ. హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

26న మల్లయ్య గట్టుకు లాంచీలు



విజయపురి సౌత్: మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన మాచర్ల మండలం అనుపు నుంచి ఏలేశ్వరస్వామి ఆలయానికి (మల్లయ్య గట్టుకు) ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేక లాంచీలను నడపనున్నట్లు లాంచీ యూనిట్ మేనేజర్ వినయతుల్లా తెలిపారు. శుక్రవారం విజయపురి సౌత్‌లోని లాంచీ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుపు నుంచి ఆ రోజు ఉదయం 7 – మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఈ సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు. టికెట్ ధరను పెద్దలకు రూ.200, ఐదేళ్లు దాటిన పిల్లలకు రూ.150గా నిర్ణయించామన్నారు. రంగనాయకుల స్వామిని దర్శించుకొని ఏలేశ్వర స్వామి గట్టుకు భక్తులు వెళ్లడం ఆనవాయితీ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో పులుసు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపు కోసం కుతంత్రం

కూటమికి పట్టభద్ర ఎమ్మెల్సీ గండం

- ప్రభుత్వంపై ఉద్యోగులు, నిరుద్యోగుల్లో వ్యతిరేకత
- నీటిమూటగా మెగా డీఎస్సీ హామీ
- నిరుద్యోగులకు భృతి హామీ హుళక్కి
- ఉద్యోగులకిచ్చిన హామీలను తుంగలో తొక్కిన వైనం
- కూటమి పార్టీల్లో విభేదాలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లడిగేందుకు జంకుతున్న ఎమ్మెల్యేలు
- మంత్రి గొట్టిపాటికి బాధ్యతల అప్పగింత



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఈనెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పచ్చ పార్టీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రారంభంలో ఎన్నిక ఏకపక్షమని ధీమాగా చెప్పినా, చివరకు వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా కనపడుతోంది. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గట్టిపోటీ ఇస్తూ చెమటలు పట్టిస్తున్నారు. ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులలో ఉన్న వ్యతిరేకతకు తోడు కూటమి పార్టీల్లోని అసంతృప్తులతో పీడీఎఫ్ అభ్యర్థికి కలిసివచ్చే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇదే విషయాన్ని నిఘా విభాగం ప్రభుత్వానికి చేరవేసింది. దీంతో బెంబేలెత్తిన ముఖ్యమంత్రి చంద్రబాబు, చినబాబు అప్రమత్తమయ్యారు.

రంగంలోకి రాబిన్‌సింగ్ బృందం

గడచిన సార్వత్రిక ఎన్నికల్లో పని చేసిన రాబిన్‌సింగ్ టీంను రంగంలోకి దించారు. పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని, బెదిరింపులు, ప్రలోభాల పర్వానికి తెరతీయకపోతే సీటు గల్లంతేనని ఆయన నివేదించినట్లు తెలుస్తోంది. దీంతో చినబాబు లోకేష్ సీన్‌లోకి వచ్చారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారథికి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. తేడా జరిగితే పరువు మొత్తం గంగలో కలుస్తుందని చెప్పినట్లు తెలుస్తోంది. ఆలపాటి విజయానికి పనిచేయకపోతే ఎమ్మెల్యేల స్థానంలో అధిష్టానం ఇన్‌చార్జ్‌లను నియమిస్తుందని మంత్రి గొట్టిపాటి ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు ప్రచారం ఉంది.

మంత్రి ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం

చినబాబు ఉత్తర్వులు అందుకున్న మంత్రి గొట్టిపాటి, ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారథి రేపల్లె, వేమూరు, బాపట్ల నేతలతోపాటు ఉమ్మడి గుంటూరు నేతలతోనూ సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి, చిన్న మంత్రి సందేశాన్ని ఎమ్మెల్యేల చెవిన వేశారు. అయితే ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులతోపాటు సొంత పార్టీ కేడర్‌లోనూ వ్యతిరేకత ఉందని, వారిని పని చేయమంటే వినే పరిస్థితి లేదని పలువురు ఎమ్మెల్యేలు మంత్రుల దృష్టికి తెచ్చినట్లు సమాచారం. పదవులు ఇవ్వకపోవడంతోపాటు అధికారంలో సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆగ్రహంతో ఉన్న జనసేన, బీజేపీ నేతలు సైతం సహకరించే పరిస్థితి లేదని కొందరు నేతలు వివరించినట్లు తెలుస్తోంది. ఓటర్లకు ఎంత రేటు పెడితే వర్కవుట్ అవుతుందన్న దానిపైనా చర్చ జరిగింది. వెయ్యి రూపాయలు సరిపోతుందని కొందరు, కాదు రూ. 2 వేలు అంతకన్నా ఎక్కువ ఇవ్వాల్సిందేనని మరికొందరు ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎందుకు?

తొమ్మిది నెలల కూటమి పాలనపై అన్నివర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన వందకు పైగా హామీలను నెరవేర్చక సర్కార్ వంచించింది. చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చక ప్రజలను వంచించారు. పైగా విద్యుత్, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు, ఊరూరా బెల్టుషాపుల ఏర్పాటు, వలంటీర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు కష్టగట్టి చిరుద్యోగులను తొలగించారు. సచివాలయ ఉద్యోగులను గాలిలో దీపంలా ఉంచారు. మెగా డీఎస్సీ పేరుచెప్పి హడావుడి చేసినా ఇంతవరకూ అతీగతీ లేదు. నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న హామీ నీటి మూటే అయింది. దీంతో చదువుకున్న యువత కూటమి సర్కార్ తీరుపై మరింత ఆగ్రహంతో ఉంది. పట్టభద్రుల ఎన్నికల్లో ఇది పీడీఎఫ్ కు కలిసి రానుందని అంచనా.

పచ్చ పార్టీలో ఇంటి పోరు

పచ్చపార్టీలో ఎమ్మెల్యేలు మొదలు కేడర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలపై వ్యతిరేకత కనపడుతోంది. అధికారం రాగానే ఎమ్మెల్యేలు అక్రమార్జనే ధ్యేయంగా వ్యాపారానికి తెరలేపారు. కనపడ్డ స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పేదల కడుపుకొట్టి నెలవారీ అమ్ముకుంటున్నారు. పార్టీ విజయం కోసం పనిచేసిన ముఖ్యనేతలు, క్రియాశీలక కార్యకర్తలకు పైసా రాబడిలేదు. నామినేటెడ్ పదవులు వస్తాయని ఆశించిన వారికి అవి దక్కలేదు. కష్టపడి తాము పనిచేస్తే ఎమ్మెల్యేలు, ఎంపీలు అధికారాన్ని అనుభవిస్తున్నారని పచ్చనేతల్లో తీవ్ర ఆగ్రహం ఉంది. ఇది ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభావం చూపించే అవకాశమున్నట్లు పరిశీలకుల అంచనా.



రీ సర్వే వేగవంతం చేయాలి

కలెక్టర్ జె.వెంకట మురళి



మోటుపల్లిలో రీ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

చినగంజాం: పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. చినగంజాం మండలం మోటుపల్లిలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టుల కింద చేపట్టిన గ్రామాల్లో సర్వే పనులను రైతుల సహకారంతో పూర్తి చేయాలని సూచించారు. మోటుపల్లిలోని 3,960 ఎకరాలను రీ సర్వే చేస్తామని తెలిపారు. గ్రామానికి చెందిన పల్లపోలు శ్రీనివాసరావు అనే రైతు భూమిలో చేపట్టిన రీ సర్వేను పరిశీలించారు. సర్వే జరుగుతున్న విధానాన్ని స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోటుపల్లిలోని చారిత్రాత్మక వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం చినగంజాంలోని ఉప్పు భూముల్లో పనిచేసే కూలీల నుంచి తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓ కూలీ తాను అప్పు చేసి ఇంటిని నిర్మించుకుంటున్నానని, వడ్డీ కట్టలేకపోతున్నానని, ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఆయన స్పందిస్తూ ప్రభుత్వం నుంచి స్త్రీ నిధి లేదా ముద్ర లోన్ ఇస్తామని తెలియజేశారు. అనంతరం చినగంజాంలోని రామకోటేశ్వరాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు, చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, చినగంజాం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, మండల సర్వేయర్ సుబ్బారావు, మోటుపల్లి గ్రామ సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు పాల్గొన్నారు.

పాన్ ఇండియా

సైబర్ నేరగాళ్ల అరెస్టు

దేశవ్యాప్తంగా ముఠాపై 213 ఫిర్యాదులు

- రూ.4 కోట్ల మేరకు మోసాలు
- తాజాగా రూ.1.64 లక్షల మోసానికి తెరతీసిన ముఠా
- ప్రభుత్వ పథకాలు ఆశచూపి మోసం చేస్తున్న వైనం
- పథకం ప్రకారం అరెస్ట్ చేసిన పోలీసులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల టౌన్: ప్రభుత్వ పథకాల పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫొటో డీపీగా పెట్టుకుని నేరాలకు పాల్పడుతున్న పాన్ ఇండియా సైబర్ నేరగాళ్లను జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వివరాలను బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వెల్లడించారు. చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 'జనని సురక్ష యోజన' పథకం పేరుతో మహిళలకు కాల్ చేసి మోసం చేశారంటూ ఫిర్యాదు అందింది. చీరాల ఆనందపేటకు చెందిన ఫిర్యాదికి సైబర్ మోసగాళ్లు కాల్ చేసి తాను ఆరోగ్య శాఖ ప్రతినిధిని అంటూ పరిచయం చేసుకున్నారు. పాలిచ్చే తల్లుల కోసం ముఖ్యమంత్రి జనని సురక్ష పథకం కింద రూ.70 లక్షలు కేటాయించారని, వాటిని బదిలీ చేస్తామని నమ్మించారు. చీరాల రెండవ పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లను, బాలింతలను ఈ విధంగా మోసం చేశారు. మాయ మాటలతో ప్రలోభ పెట్టి ఫోన్ పే ద్వారా డబ్బు బదిలీ చేయమని వారిని ఒప్పించారు. ఫోన్ పే అకౌంట్‌లోని యూపీఐ ఐడీని తెలుసుకొని 'బ్లింకింట్' అనే ఆన్‌లైన్ డెలివరీ అప్లికేషన్ ద్వారా అనేక రకాలైన వస్తువులను కొంటున్నారు. వాటి రుసుము బాధితుల అకౌంట్ నుంచి బదిలీ అయ్యేలాగా సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ విధంగా ముగ్గురు బాధితుల నుంచి రూ.1,64,724 లక్షలను బదిలీ చేసుకున్నారు.

ఢిల్లీకి వెళ్లిన పోలీసు బృందం

కేసును ఎస్పీ తుషార్‌డూడీ చాలెంజ్‌గా తీసుకున్నారు. ఐటీ కోర్ ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలోని టెక్నికల్ బృందం ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఢిల్లీ వెళ్లారు.కేసులో ఏ-3 నిందితుడు జతిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఫోన్‌ను సీజ్ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మిగిలిన అనుమానితుల వివరాలను సేకరించారు. నిందితుల వద్ద నుంచి రూ.1,90,000 నగదు, మూడు సెల్‌ఫోన్లు, 15 సిమ్‌కార్డులు, రెండు ఏటీఎంలు, నాలుగు బ్యాంక్ ఖాతా పుస్తకాలను సీజ్ చేశారు. వీరిపై దేశంలో ఆరు రాష్ట్రాలలోని పలు పోలీస్‌స్టేషన్లలో 94 సైబర్ ఫిర్యాదులు నమోదయ్యాయి.


అపరిచితులను నమ్మొద్దు

ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ అపరిచితులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ప్రభుత్వ పథకాల పేరుతో కాల్ చేస్తే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. అపరిచిత లింక్‌లను క్లిక్ చేయవద్దని చెప్పారు. సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే 1930కు కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

సిబ్బందికి రివార్డులు

కేసు దర్యాప్తులో విశేష కృషి చేసిన చీరాల- 2 టౌన్ సీఐ బి.నాగభూషణం, ఆర్ఐ టి.శ్రీకాంత్, ఐటీ కోర్ టెక్నికల్ టీం ఎస్ఐ షేక్ నయాబ్ రసూల్, చీరాల-2 టౌన్ ఎస్ఐ నాగశ్రీను, ఐటీ కోర్ టెక్నికల్ టీం కానిస్టేబుల్స్ డి.సురేష్, కె.రాము, మహిళా కానిస్టేబుళ్లు ఐ.కీర్తి, డి.తబితలను జిల్లా ఎస్పీ అభినందించి, క్యాష్ రివార్డులు అందజేశారు.

వ్యాఘ్ర వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం నాలుగో రోజు స్వామి వారు వ్యాఘ్ర వాహనంపై భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవ కైంకర్యకర్తలుగా పట్టణానికి చెందిన సింహే నారాయణరావు వ్యవహరించారు. ఆలయంలో భక్తులకు దాతలు పొంగలి ప్రసాదం పంపిణీ చేశారు. ఉత్సవ నిర్వహణను దేవస్థాన ఈవో జేవీ నారాయణ పర్యవేక్షించారు.

సైనికుడా వందనం !



అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, ఆర్మీ అధికారులు.

- కన్నీటి వీడ్కోలు మధ్య సైనిక లాంఛనాలతో జవాన్ మోహన్ వెంకటేష్ అంత్యక్రియలు.
- భౌతికకాయానికి నివాళులర్పించిన అధికారులు, ఆర్మీ సిబ్బంది



వెంకటేష్ భౌతికకాయం వద్ద విలపిస్తున్న భార్య గాయత్రి, తల్లి శివపార్వతి



సైనిక లాంఛనాల మధ్య అంత్యక్రియలు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): రాజస్థాన్‌లో జరిగిన ఫైరింగ్ శిక్షణలో గన్ బ్యాక్ ఫైర్ అవడంతో మృతి చెందిన ఆర్మీ జవాన్ పరిశా మోహన్ వెంకటేష్ భౌతికకాయానికి బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలంలోని గౌడపాలెంలో శుక్రవారం కుటుంబ సభ్యుల కన్నీటి వీడ్కోలు మధ్య సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. రాజస్థాన్‌లో ఈనెల 18న గన్ బ్యాక్ ఫైర్ అవడంతో మోహన్ వెంకటేష్ మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఆర్మీ అధికారులు గురువారం భౌతికకాయాన్ని రాజస్థాన్ నుంచి మొదట ఢిల్లీకి అనంతరం గన్నవరం ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చారు. ఎయిర్‌పోర్టులో ఆంధ్రా, తెలంగాణ సబ్ ఏరియా హెడ్‌క్వార్టర్ నుంచి ఆర్మీ అధికారులు సైనిక లాంఛనాలతో నివాళులర్పించారు. అనంతరం ఆర్మీ ప్రత్యేక వాహనంలో భౌతికకాయాన్ని స్వగ్రామం గౌడపాలెం తీసుకువస్తుండగా కుటుంబ సభ్యులు, మాజీ సైనికులు, యువకులు జాతీయ జెండాలు చేతబట్టి, ద్విచక్ర మోటారు వాహనాలతో 'అమర్ రహే వెంకటేష్ ' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా ఎదురొచ్చారు. చందోలు, రాంబొట్ల వారిపాలెం, పరిశావారిపాలెం, మంతెన వారిపాలెం, పిట్టలవానిపాలెం మీదుగా గౌడపాలేనికి రాత్రి 8.30 గంటలకు తీసుకువచ్చారు.

భోరున విలపించిన తల్లిదండ్రులు, భార్య

మూడు రోజులుగా వెంకటేష్ భౌతికకాయం కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు, భార్య ఒక్కసారిగా చూసి భోరున విలపించారు. శుక్రవారం ఉదయం భౌతికకాయాన్ని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, ఆర్డీవో గ్లోరియా, ఎమ్మార్వో వెంకటేశ్వరావు నివాళులర్పించారు. అనంతరం ఆర్మీ కెప్టెన్ అంకిత్‌శర్మ, సత్యప్రసాద్, ముగ్గురు జేసీవోలు, 18మంది జవాన్లు వెంకటేష్ భౌతికకాయానికి నివాళులర్పించారు. శవ పేటికపై త్రివర్ణ పతాకాన్ని కప్పడానికి అతని భార్య గాయత్రికి అందజేశారు. ఆ తరువాత ఆర్మీ అధికారులు, కుటుంబసభ్యులు భౌతికకాయాన్ని ర్యాలీగా శ్మశానవాటికకు తీసుకువెళ్లారు. ఆర్మీ అధికారులు సైనిక లాంఛనాలు పూర్తి చేసి, గాల్లోకి కాల్పులు జరిపారు. తండ్రి శ్రీనివాసరావు కుమారుని చితికి తలకొరివి పెట్టి, నిప్పంటించారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమ అధికారిణి గుణశీల, మాజీ సైనికుల సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ కెప్టెన్ దావూద్, గ్రామ సర్పంచ్ బొలగాని అరుణకుమారి, సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు చేబ్రోలు కృపానందం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శివరాత్రికి గోవాడ బాలకోటయ్య ముస్తాబు

- రంగులతో ఆలయం ముస్తాబు
- ఆలయం చుట్టూ ప్రభలు తిరగడానికి ఏర్పాట్లు
- తాగునీటి సౌకర్యం, చలువ పందిళ్లు, క్యూ లైన్ల ఏర్పాట్లు



బాలకోటేశ్వరస్వామి

అమర్తలూరు(వేమూరు): ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో రెండో కోటప్ప కొండగా ప్రసిద్ధిగాంచిన గోవాడ బాలకోటేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రిని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కార్యనిర్వహణాధికారి అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేసినట్లు చెప్పారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, చలువ పందిళ్లు, క్యూ లైన్లతో పాటు ఆలయం చుట్టూ ప్రభలు తిరగడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ రహదారిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. భక్తులు ప్రశాంతంగా స్వామిని దర్శించుకునేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది స్వామికి అర కోటి రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు.ఈ ఏడాది భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆదాయం కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.భక్తులంతా స్వామిని దర్శించుకుని అనుగ్రహం పొందాలని ఆయన సూచించారు.

ఆలయ ప్రాశస్త్యం

1904లో గోవాడలో నిర్మించబడిన శ్రీ బాల కోటేశ్వర స్వామి ఆలయం భక్తుల అభిమానాన్ని పొందుతూ విశిష్ట దేవాలయంగా ప్రఖ్యాతి చెందింది. ఒకసారి స్వామిని దర్శించుకొంటే కష్టాలన్నీ తీరతాయనే నమ్మకం భక్తుల్లో ప్రాచుర్యం పొందింది. ఇంత ప్రాముఖ్యత కలిగిన బాలకోటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఆనాడు బ్రాహ్మణ కోడూరు వాస్తవ్యులు కూచిపూడి తిరుపతిరాయుడు నడుం బిగించారు. గోవాడ గ్రామస్తులు, బంధువులు సహకారంతో ఆలయాన్ని నిర్మించి మహా శివరాత్రి రోజున ప్రభను కట్టి, ఉత్సవాలు నిర్వహించడాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలపాటి దేవయ్య అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైంది. ఏటా మహా శివరాత్రి ఉత్సవాలు జరుపుతూ ఆలయానికి వచ్చిన ఆదాయంతో 1930లో దేవాలయాన్ని నల్ల రాయితో పునర్నిర్మాణం చేశారు. బాలకోటేశ్వరస్వామికి కుడివైపున శ్రీ వీరభద్రస్వామి, ఎడమ వైపున శ్రీ పార్వతి అమ్మవారిని ప్రతిష్ఠించారు. దేవస్థానం నిర్వహణకు 15.50 ఎకరాలను ఏర్పాటు చేశారు.1925లో కావూరు చెందిన భక్తురాలు ఆలయ అవరణలో అంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. దేవస్థానానికి వ్యవస్థాపక ధర్మకర్తలు లేరు. ప్రస్తుతం దేవస్థానం బాధ్యతలను దేవదాయ శాఖ చేపట్టింది. 1986 మార్చి 5న ఆలయంలో నవ గ్రహ దేవత ప్రతిష్ఠ జరిగింది. రాష్ట్రంలోని నవగ్రహాలయాల్లో ప్రాముఖ్యతను సంతరించుకుంది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **5,000** గరిష్ఠం : రూ. **5,900**

మోడల్ ధర రూ. **5500**

క్లుప్తంగా

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



గుంటూరు రూరల్: ప్రకృతి సేద్యానికి రైతులను ప్రోత్సహించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ప్రైవేట్ హాలులో రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ, ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజులపాటు ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై రాష్ట్ర స్థాయి శిక్షణ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి సేద్య ఆవశ్యకతను వివరించారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎమ్‌డీఎస్) గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి బి. రామారావు, అధికారులు చక్రవర్తి, గోపీచంద్, ప్రవీణ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు (మోడల్ స్కూల్స్) 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని 14 ఆదర్శ పాఠశాలల్లో ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 – మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వివరించారు.

రేపటి నుంచి కోటప్పకొండ తిరునాళ్ల

- ఆదివారం నుంచి భక్తుల రాక
- 26న మహా శివరాత్రి తిరునాళ్ల జాగరణ
- త్రికోటేశ్వరుడిని దర్శించుకోనున్న లక్షలాది మంది భక్తులు
- ఇంకా కొనసాగుతున్న ఏర్పాట్లు
- పూర్తికాని రహదారుల మరమ్మతులు
- తుది దశకు పెయింటింగ్ పనులు



ఆలయ ముఖ ద్వారానికి రంగులు వేస్తున్న దృశ్యం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. అప్పటి నుంచి కొండకు భక్తుల రాక ప్రారంభం కానుంది. మహా శివరాత్రిని పురస్కరించుకొని 26వ తేదీన తిరునాళ్ల జాగరణతో ఉత్సవాలు పూర్తవుతాయి. లక్షల మంది భక్తులు తరలి వచ్చే తిరునాళ్ల కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ తిరునాళ్లకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. లక్షల మంది స్వామిని దర్శించుకొని తిరునాళ్లలో పాల్గొంటారు. శివరాత్రి జాగరణ పాటిస్తారు. శివరాత్రి ముందు వచ్చే ఏకాదశి నుంచి కొండకు భక్తుల రాక ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది ఏకాదశి ముందు రోజు ఆదివారం రావడంతో ఆ రోజు నుంచి బుధవారం వరకు భక్తులు తరలి రానున్నారు.

అడుగడుగునా నిర్లక్ష్యమే..

తిరునాళ్ల కోసం జిల్లా అధికారులు రెండు నెలల ముందే సమాయత్తం అయ్యారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాలు జరిగాయి. ఈ నెల 20వ తేదీకి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు అవి పూర్తి కాలేదు. తిరునాళ్లకు ఒకరోజు ముందు ఏర్పాట్లు పైపైన చేయాలనే భావనలో పలు శాఖలు ఉన్నాయి.

హడావుడిగా పనులు..

ఆఖరి నిమిషంలో పలు పనులు పూర్తి చేయడం ప్రభుత్వ శాఖలకు పరిపాటిగా మారింది. కొండ కింద తిరునాళ్ల జాగరణలో లక్షల మంది పాల్గొంటారు. వీరి కోసం పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుద్దీపాలు, బ్యారికేడ్ వంటి పనులు పూర్తిచేయాలి. రేపటి నుంచి కొండకు భక్తుల రాక ప్రారంభం అవుతున్నా ఆయా పనులు పూర్తి కాలేదు. ఆర్అండ్‌బీ నిర్వహించే బ్యారికేడ్ పనులు ప్రారంభించనే లేదు. విద్యుత్ దీపాలు ఏర్పాటు పనులు రెండు రోజుల క్రితం మొదలుపెట్టారు. తాగునీటి కొళాయిలు, తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేస్తున్నారు. చిలకలూరిపేట మేజర్ వద్ద నూతనంగా అందుబాటులో తీసుకువచ్చిన శివ కుటుంబం వద్ద మెట్లకు గ్రానైట్, రైలింగ్ పనులు పూర్తిచేయాల్సి ఉంది. కొండకు వచ్చే లింక్ రోడ్లకు మరమ్మతులూ పూర్తి కాలేదు.

ప్రధాన ఆలయంలోనూ అసంపూర్తి

కొండపైన ప్రధాన ఆలయ ప్రాంగణంలోని పలు ఉప ఆలయాలకు రంగులు వేసే పనులు శుక్రవారం కూడా కొనసాగాయి. ఆలయ ముఖ ద్వారానికి రంగులు వేస్తున్నారు. ధ్యానశివుని విగ్రహానికి రంగులు వేసే పని మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది. ఆదివారం నుంచి భక్తులు రాక ప్రారంభమవుతున్నా షామియానా పనులు పూర్తి కాలేదు.

ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెరగాలి

కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: ప్రభుత్వ సేవల్లో నాణ్యత, ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ప్రభుత్వ సేవల్లో ప్రజాభిప్రాయంపై వివిధ శాఖల జిల్లా అధికారులతో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సేవలన్నింటిలో బాపట్ల జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. పారదర్శక పాలన అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఐవీఆర్ఎస్, వాట్సాప్, క్యూఆర్ కోడ్ విధానంలో ఆర్టీజీఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సంతృప్తి స్థాయి నమోదు ఆధారంగా జిల్లాకు, శాఖలకు గ్రేడ్‌లు ప్రకటిస్తుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ, వినయంతో సేవలను ప్రజలకు అందించాలని ఆయన సూచించారు. వైద్య సేవలు, అన్న క్యాంటీన్‌లో బాపట్ల జిల్లా 13వ ర్యాంకు, దీపం-2 లో మూడో ర్యాంక్, చెత్త సంపద కేంద్రాల నిర్వహణలో 15లో ఉందని వెల్లడించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, అధికారులు శ్రద్ధతో పనిచేయాలని మార్గదర్శనం చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం

బాపట్ల: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. రైతుల రిజిస్ట్రేషన్, యూరియా అమ్మకాలు, ఈ– పంట, ఈకేవైసీ, లోన్ల మంజూరుపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో వీక్షణ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతుల రిజిస్ట్రేషన్ గురించి మండలాల వారీగా ఆరా తీశారు. పీఎం కిసాన్‌లో ఉన్న డేటా, వెబ్‌ల్యాండ్‌లో వచ్చిన డేటా కచ్చితంగా ఉందా.. లేదా ? అని సరి చూసుకొని తర్వాతే ఆమోదం తెలపాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి, అదనపు ధరలతో అక్రమ విక్రయాలు చేస్తున్న షాపు యజమానులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చెప్పారు. మార్కెట్లో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఫిర్యాదులపై తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని ఆదేశించారు. 40 కేజీల యూరియా బస్తా ధర రూ.256.50గా ప్రభుత్వం నిర్ణయించిందని, దానికి మించి అమ్మే వ్యాపారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని సూచించారు. అన్ని మండలాలలో యుద్ధ ప్రాతిపదికన తనిఖీలు చేసి నివేదిక తయారు చేయాలని రెవెన్యూ డివిజన్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ– పంట రిజిస్ట్రేషన్ విషయంపై ఆరా తీశారు. తక్కువ రిజిస్ట్రేషన్ జరిగిన మండలాల అగ్రికల్చర్ అధికారులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. సీసీఆర్సీ కార్డుల మంజూరులో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు రుణాల మంజూరులో శ్రద్ధ వహించాలని సూచించారు. రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. రుణాల వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వాటిని తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు రుణాల మంజూరులో బ్యాంకర్లకు భరోసా కల్పించాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అశ్రద్ధ వద్దు

ఆర్డీవో నేలపు రామలక్ష్మి



మాట్లాడుతున్న ఆర్డీవో

రేపల్లె రూరల్: ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధులపై పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం పోలింగ్ అధికారులు(పీవోలు), అసిస్టెంట్ పోలింగ్ అధికారులు (ఏపీవో), సెక్టారు ఆఫీసర్లు, మైక్రో అబ్జ ర్వర్‌లకు రెండో విడత నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆమె మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పీవో, ఏపీవోల విధులే కీలకమని తెలిపారు. ఓటర్లు స్వచ్ఛందంగాఓటు హక్కును వినిగించుకునేలా చూడాలని చెప్పా రు. ఓటు గుర్తింపు కార్డులను నిశితంగా పరిశీలించటంతో పాటు పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు అరికట్టంలో సమర్థంగా పని చేయాలని ఆదేశించారు. పోలింగ్ రోజున కేంద్రాలలోకి ఆయా పార్టీల నుంచి గుర్తింపు పొందిన ఏజెంట్లను మాత్రమే అనుమతించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలును మైక్రో అబ్జర్వర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆమె సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా సెక్టారు ఆఫీసర్లు పర్యవేక్షించాలని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మాస్టర్ ట్రైనర్ వెంకటేశ్వ రరావు ఎన్నికల విధులు, ఓటువేసే విధానం, పోస్టల్ బ్యాలెట్, ఓట్లు లెక్కింపులపై అవగాహన కల్పించారు.

24న కలెక్టరేట్ ఎదుట ధర్నా

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ముందు 24వ తేదీ ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ చెప్పారు. స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ధర్నాల్లో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

25న శివరాత్రి సమన్వయ కమిటీ సమావేశం

అమరావతి: పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీ మాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి శివరాత్రి బ్రహ్మోత్సవాల సమన్వయ కమిటీ మూడో సమావేశం ఈ నెల 25వ తేదీన జరగనుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్ ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి ఆర్‌డీవో రమణకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రాంగణంలో సమావేశం ఉంటుందని చెప్పారు.

పండ్ల తోటల పెంపకంపై రాయితీ

నరసరావుపేట రూరల్: పండ్లతోటల పెంపకంపై ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డాట్ సెంటర్ శాస్త్రవేత్త నాగేష్ తెలిపారు. మండలంలోని పమిడిమర్రులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త నాగేష్, ఉద్యాన శాఖ అధికారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం మిర్చి ధర తక్కువగా ఉన్నందున రైతులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో పండ్ల తోటలు లాభదాయకంగా ఉంటాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంద శాతం రాయితీలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్‌లో ఉద్యాన పంటలకు ఇచ్చే రాయితీని వచ్చే 2025–26 నుంచి పెంచినట్టు తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రూ.46.60 లక్షల విలువైన 234 మొబైల్స్ రికవరీ



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితులకు అప్పగిస్తున్నట్లు జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి చెప్పారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సుమారు రూ.46.60 లక్షల విలువైన 234 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శుక్రవారం బాధితులకు అప్పగించారు. ఏఎస్పీ మాట్లాడుతూ బాధితులు పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేయడం ఆనందంగా ఉందన్నారు. సెల్‌ఫోన్లు పాయినట్లయితే పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 8688831574 లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి మాట్లాడితే ఆ నంబర్లను బ్లాక్ చేసి, దగ్గర్లోని పోలీస్‌స్టేషన్ లేదా జాతీయ సైబర్ భద్రత టోల్ ఫ్రీ నంబర్ 1930కు సమాచారం అందించాలని సూచించారు. సీఐలు నిషార్ బాషా (ఐటీకోర్), నరేష్‌కుమార్ (పీసీఆర్), హెడ్ కానిస్టేబుళ్లు కిషోర్, రమేష్, కానిస్టేబుళ్లు శ్రీధర్, ఇమాంసాహెబ్, గౌస్ బాషా, మానస, కరీముల్లాను ఏఎస్పీ అభినందించారు.

‘ఏక్ పేడ్ మాకే నామ్’తో పర్యావరణ పరిరక్షణ

చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి



మొక్కకు నీరు పోస్తున్న చిరంజీవి చౌదరి

మార్టూరు: తల్లి తన బిడ్డను ఎలా సంరక్షిస్తుందో మొక్క కూడా తల్లిలాగే పర్యావరణాన్ని పరిరక్షిస్తుందని, అందుకే మనమంతా తల్లి పేరుతో మొక్కలు నాటాలని ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొబ్బేపల్లిలోని కొండ సమీపంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బొబ్బేపల్లి కొండ ప్రాంతంలోని రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామని పిలుపునిచ్చారు. ఫారెస్ట్ భూమిలో మొక్కలు నాటడం కోసం గ్రామంలో అటవీ శాఖకు సంబంధించిన నర్సరీని ఏర్పాటు చేసేందుకు గ్రామస్తుల కోరికపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రీజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఐకేవీ రాజు మాట్లాడుతూ బొబ్బేపల్లి కొండ చుట్టుపక్కల మొక్కల పెంచడం ద్వారా దిగువ ప్రాంతంలో నీటి లభ్యత పెరిగి పంటలు, పర్యావరణం అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం అధికారులు మొక్కలు నాటి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ అధికారి ఎల్. భీమన్న, కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్, బొబ్బేపల్లి సర్పంచ్ తాళ్లూరి లావణ్య, కోటేశ్వర రావు, మాజీ సర్పంచ్ దండా వీరాంజనేయులు, శరత్ పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

బాపట్ల: బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ జిల్లా కార్యదర్శి పూనూరి అనిల్ డిమాండ్ చేశారు. బాపట్లలోని ఎస్‌బీఐ వద్ద యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులు నిరసన చేపట్టారు. జిల్లా కార్యదర్శి పూనూరి అనిల్ మాట్లాడుతూ ఐదు రోజుల పనిదినాలు వర్తింపచేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, గ్రాట్యుటీని పెంచి సెంట్రల్ ఉద్యోగులతో సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.యలమంద, ఎస్.కె.ముజుఫర్, ఐ.శ్రీనివాస్, తులసి, సీహెచ్. ఉమామహేష్ ,వి.బాబూరావు, స్వాములు, పలు బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

లక్ష రూపాయల విలువ చేసే ఐదు మోటార్లు స్వాధీనం



నిందితులతో రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది

చీరాల: మోటార్ల చోరీ కేసులో ఇద్దరిని ఈపురుపాలెం పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. చీరాల రూరల్ మండలం కావూరివారిపాలెంలోని పొలాల్లో నీళ్ల మోటార్లు చోరీకి గురికావడంతో గ్రామానికి చెందిన అక్కల సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన అక్కల గోపిరెడ్డి, కావూరి గోపిరెడ్డి నిందితులని తేలింది. ఇద్దరు మద్యం, చెడు వ్యసనాలకు అలవాటుపడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు పొలాల్లోని మోటార్లను రాత్రిపూట చోరీ చేసి అమ్ముకుంటున్నారు. ఈనెల 15, 17తేదీల్లో ఫిర్యాది అక్కల సాంబయ్య, అతని పక్కనే ఉన్న గుండుబోయిన ఏసురాజు పొలంలో, అదే గ్రామానికి చెందిన అక్కల వెంకటరెడ్డి, కావూరి శ్రీనివాసరెడ్డి, కావూరి శివారెడ్డిలకు చెందిన పొలాల్లోని ఐదు మోటార్లను చోరీ చేశారు. దర్యాప్తు అనంతరం పోలీసులు నిందితులను శుక్రవారం సాయంత్రం కావూరివారిపాలెం వై.జంక్షన్ వద్ద అరెస్టు చేశారు.

నకిలీ బంగారాన్ని పట్టుకున్న బ్యాంక్ అధికారులు

పోలీసులకు వ్యక్తి అప్పగింత

అద్దంకి రూరల్: తాకట్టు పెట్టేందుకు బ్యాంకుకు తెచ్చిన బంగారం నకిలీదిగా గుర్తించి బ్యాంకు అధికారులు ఓ వ్యక్తిని పోలీసులకు అప్పగించిన సంఘటన శుక్రవారం అద్దంకి పట్టణంలో చోటు చేసుకుంది.అద్దంకికి చెందిన వ్యక్తి ఓ బ్యాంక్‌లో బంగారాన్ని తాకట్టు పెట్టటానికి గాజులు తీసుకువచ్చాడు. వాటి నాణ్యతను అధికారులు పరీక్షించగా, అవి నకిలీవిగా నిర్ధారణ అయ్యాయి. ఇదే వ్యక్తి వారం రోజుల కిందట వేరే బ్యాంకులో కూడా నకిలీ బంగారం పెట్టి రుణం తీసుకున్నాడని తెలియడంతో, రెండు బ్యాంకుల అధికారులు నిందితుడిని పోలీసులకు అప్పగించారు.

వలస కూలీల మినీ లారీ బోల్తా

ఆరుగురికి గాయాలు



మేడికొండూరు: వలస కూలీలతో వెళుతున్న మినీ లారీ రోడ్డుపై బోల్తా కొట్టడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని సత్తెనపల్లి రోడ్డులో గుళ్ళపాలెం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడు గ్రామానికి చెందిన వలస కూలీలు 25 మంది గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కోవెలమూడి గ్రామానికి బయలుదేరారు. మార్గంమధ్యలో మేడికొండూరు సమీపంలోని గుండ్లపాలెం పెట్రోల్ బంక్ వద్ద మినీలారీ అదుపు తప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఘటనలో లారీలో ఉన్న రాజ్ కుమార్ చంద్రమ్మలకు తీవ్ర గాయాలు అవ్వగా మరో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి 108 సహాయంతో తరలించారు. ప్రమాద సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మేడికొండూరు: ఆటోను వ్యాన్ ఢీకొన్న ఘటనలో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పేరేచర్ల కాల్వ సమీపంలో జరిగింది. పేరేచర్ల నుంచి మేడికొండూరు వైపు వెళ్తున్న ఆటోను గుంటూరు నుంచి సత్తెనపల్లి వైపు వెళ్తున్న వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో టిప్పర్ దగ్ధం



కారంచేడు: షార్ట్ సర్క్యూట్ కారణంగా టిప్పర్ దగ్ధమయిన సంఘటన గురువారం రాత్రి కారంచేడు సమీపంలో జరిగింది. స్థాల స్థానికుల కథనం మేరకు.. వాడరేవు–పిడుగురాళ్ళ 167/ఏ జాతీయ రహదారి పనులకు అవసరమైన చిప్స్, ఇసుక, మట్టి, కంకర లోడ్లుతో టిప్పర్ లారీలు తిరుగుతున్నాయి. వీటిలో కారంచేడు ఉత్తర పొలాల సమీపంలో కల్యాణ మండపం ఎదురు వంతెన పైనుంచి అవతలకు వెళ్లిన లారీ నుంచి ఒక్కసారిగా పొగలు కమ్ముకొచ్చాయి. దీంతో వెంటనే డ్రైవర్ అప్రమత్తమై ఆపేసి కిందకి దిగిపోయాడు. అప్పటికే మంటలు వేగంగా వాహనం చుట్టేశాయని డ్రైవర్ తెలిపాడు. హైవే అథారిటీకి చెందిన ట్యాంకర్ అందుబాటులో ఉండటంతో ఆ నీటితో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈలోగా చీరాల నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. లారీ ఇంజన్ క్యాబిన్ భాగం పూర్తిగా దగ్ధమయ్యింది. కారంచేడు ఎస్ఐ సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ఎన్‌హెచ్ఏఐ నుంచి ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు.

• తుది దశకు మూడు వంతెనల పనులు





గుంటూరు నగరంలో రైల్వే శాఖ చేపట్టిన మూడు వంతెనల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 25వ తేదీన ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నవంబర్ 26న వంతెనల నిర్మాణ పనులు చేపట్టారు. మూడు నెలల్లోనే పనులు పూర్తి చేస్తామని తొలుత ప్రకటించినా, వాటర్ పైప్‌లైన్‌లు అడ్డురావడంతో జాప్యం జరిగింది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు